సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023

లోకేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- జగన్ పాలనలో రాష్ట్ర ప్రగతి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రాజా



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్ నీలి ఆనంద్

రాజమహేంద్రవరం సిటీ: యువగళం పాదయాత్రలో నారా లోకేష్ చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. జయంతికి.. వర్ధంతికి, రూ.45 వేలకు.. రూ.90 వేలకు మధ్య వ్యత్యాసం తెలియకుండా ఆయన చేస్తున్న ఉపన్యాసాలను విని ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ నీలి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం విద్యాసాధికారత జగనన్నతోనే సాధ్యం అనే కార్యక్రమాన్ని నగరంలో సుమారు 12 వేల మంది విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. పాత సోమాలమ్మ ఆలయం నుంచి జేఎన్ రోడ్డు రామాలయం సెంటర్ వరకూ జరిగిన భారీ ర్యాలీలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

యువగళం.. గందరగోళం

జక్కంపూడి రాజా మాట్లాడుతూ మూడు పదిహేన్లు ఎంతో లెక్క తెలియని లోకేష్.. రాష్ట్ర ప్రజలకు న్యాయం చేస్తానని యువగళం పేరుతో గందరగోళ పాదయాత్ర చేయడం విడ్డూరమన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని విధంగా విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. నాడు - నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపు రేఖలు మార్చడమే కాక, విద్యార్థులు చదువులలో మరింత రాణించాలని లక్ష్యంతో వారికి బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందించి రికార్డు సృష్టించారన్నారు. మన ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మేలు జరుగుతోందన్నారు. నీలి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల కోసం సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, కేజీ టు పీజీ వరకూ ఉచిత విద్యను అందిస్తున్నారన్నారు. వినూత్న మార్పులతో విద్యావ్యవస్థను బలోపేతం చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు పొన్నగంటి చైతన్య, వైఎస్సార్ సీపీ నాయకులు నందెపు శ్రీనివాస్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చంద్రబాబు, కోనసీమ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు శిరీష్, కాకినాడ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు అనిల్, సురేంద్ర, పండు పృథ్వీ, మురళీ రెడ్డి పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యం

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- వేమగిరిలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన



కమ్యూనిటీ హాలు శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్, రాజ్యసభ సభ్యుడు బోస్

కడియం: రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. వేమగిరిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న 40 సెంట్లలో సుమారు రూ.కోటి నిర్మించే కమ్యూనిటీ హాలుకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎంతో విలువైన ఈ స్థలాన్ని బీసీల కోసం సీఎం జగన్ కేటాయించడం హర్షణీయమన్నారు. మొదటి దశలో రూ.50 లక్షలతో పనులు ప్రారంభమవుతాయన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బీసీల ఉన్నతిని కోరుకుంటున్న సీఎం జగన్‌కు మనమంతా కృతజ్ఞతలు తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. స్థలానికి చేరువలోనే కాలువ ఉందని, దానిపై వంతెన నిర్మిస్తే నేరుగా నేషనల్ హైవేపై నుంచి కూడా కమ్యూనిటీ హాలుకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, పార్టీ నాయకులు పాలిక శ్రీను, గుబ్బల నాగార్జున, కట్టా జమీందారు, పితాని శ్రీను, నరాల గణపతి, బైవరపు నాగేశ్వరరావు, నరాల శ్రీను పాల్గొన్నారు.

ప్రజల భవిష్యత్తుకు జగనన్నే గ్యారంటీ

రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్యారంటీ అని ఎంపీ భరత్ రామ్ అన్నారు. వేమగిరిలో బీసీ కమ్యూనిటీ హాలు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం చేసిన అవకతవకలను ఏకరువు పెట్టారు. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. చంద్రబాబు ఇచ్చేది ప్రజల భవిష్యత్తు గ్యారంటీ కాదని, ఆయన సొంత పుత్రుడు లోకేష్, దత్త పుత్రుడు పవన్, ఆయన మనుమడు, టీడీపీకి బాకా కొట్టే పచ్చ మీడియాల భవిష్యత్తుకు మాత్రమే భరోసా అన్నారు.

క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఆలయ ముఖ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

పిఠాపురం: రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. తాటిపర్తి అపర్ణాదేవి ఆలయ ముఖ మండపాన్ని కొత్తగా గొల్లప్రోలు 216 జాతీయ రహదారిపై నిర్మించగా దానిని ఆయన శనివారం ప్రారంభించారు. తొలుత మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కాకినాడ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ మండప నిర్మాణ దాత నాళం నారాయణ రావు (బేబీరావు), తాటిపర్తి సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ దాసం వెంకటేష్, ఆలయ కమిటీ చైర్మన్ గారపాటి బుజ్జి, నేమాని ఆదివిష్ణు పాల్గొన్నారు. రీసర్వేలో సమస్యలను పరిష్కరించాలని జెడ్పీటీసీ నాగ లోవరాజు ఆధ్వర్యంలో పలువురు రైతులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన సమస్యలు లేకుండా చూస్తున్నామని హామీ ఇచ్చారు.

లోకేష్ యువగళానికి స్పందన కరవు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన కరవైందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. సీఎం జగన్ అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తున్నారన్నారు. అదే పథకానికి అమ్మకు వందనం అనే పేరు పెట్టి లోకేష్ ప్రచారం చేస్తున్నారన్నారు. ఆయన సభలకు జనం రాకపోగా, వచ్చిన కొద్దిమంది కూడా అదేదో కామెడీ కార్యక్రమంలా చూస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో యువత, మహిళలు, రైతులు, నిరుద్యోగులు ఎంతో దుర్భర పరిస్థితిలో ఉండేవారన్నారు. అన్నివర్గాలూ ఆర్థిక అభ్యున్నతి సాధించేలా సీఎం జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

వాడపల్లి వాసా.. శ్రీచిద్విలాసా

- భక్తులతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం
- ఒక్కరోజే రూ.34.92 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి



వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ఆత్రేయపురం: కోరిన కోర్కెలు తీర్చే ఆ ఏడుకొండల స్వామిని భక్తులు మనసారా కొలిచారు.. అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించారు.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో శోభాయమానంగా మారింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని అర్చకులు వరికంకులు, వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ ఒక్కరోజే ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.34,92,081 ఆదాయం సమకూరిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామివారి దర్శనానికి అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆలయానికి పెరుగుతున్న రద్దీపై ప్రత్యేక దృష్టి సారించి భక్తులకు ఇబ్బంది రాకుండా చూశారు. అనంతరం ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్నసమారాధన నిర్వహించారు. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవస్వామి ఆలయం, ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

అమలాపురంలో సినీతారల సందడి

- సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం
- మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా హాజరు



షోరూమ్‌లో వస్త్రాలను చూపుతున్న సినీ తారలు పాయల్ రాజ్‌పుత్, అనసూయ



షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే చిట్టిబాబు, షాపింగ్ మాల్ డైరెక్టర్లు

అమలాపురం టౌన్: సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సంస్థ తమ 33వ బ్రాంచ్‌ను అమలాపురం పట్టణంలో ఏర్పాటు చేసింది. స్థానిక హైస్కూల్ సెంటరులోని బహుళ అంతస్తుల భవనంలో ఈ షాపింగ్ మాల్‌ను శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సినీ తారలు పాయల్ రాజ్‌పుత్, అనసూయ హాజరై సందడి చేశారు. తొలుత షాపింగ్ మాల్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మంత్రి విశ్వరూప్, కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ కోనసీమ జిల్లా ఏర్పాటయ్యాక వస్త్ర శ్రేణిపరంగా మార్కెట్ అవకాశాలు క్రమేపీ పెరుగుతున్నాయన్నారు. సినీ తారలు పాయల్ రాజ్‌పుత్, అనసూయ మాట్లాడుతూ పచ్చని కోనసీమలో వస్త్ర వ్యాపారం కొంత పుంతలు తొక్కుతూ కార్పొరేట్ స్థాయికి ఎదగడం ఈ ప్రాంత అభివృద్ధిలో ఓ భాగమన్నారు. ఇక్కడి ప్రజల ఆదరాభిమానాలు మరువలేమని చెప్పారు. సినీ తారలిద్దరూ షాపింగ్ మాల్‌లోని అన్ని వస్త్ర విభాగాల్లోకి వెళ్లి అక్కడి వస్త్ర రకాలను పరిశీలించారు. ముఖ్యంగా పట్టు చీరల విభాగంలో చీరలతో ఫోటోలకు ఫోజులిచ్చి సందడి చేశారు.

అభిమానులతో సెల్ఫీలు దిగారు. అనంతరం షాపింగ్ మాల్ వెలుపల రోడ్డు చెంత ఏర్పాటు చేసిన వేదికపై సినీ తారలు రాజ్‌పుత్, అనసూయలు వేలాది మంది అభిమానులకు అభివాదం చేశారు. కొద్దిసేపు అభిమానులతో ముచ్చటించారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సంస్థ డైరెక్టర్లు సురేష్ సీర్ల, అభినయ్, రాకేష్, కేశవ్ మాట్లాడుతూ తమ షాపింగ్ మాల్‌లో అన్ని రకాల సంప్రదాయ పట్టు చీరలు, దుస్తులతో పాటు అధునాతన డిజైన్ల వస్త్రాలు, చిన్న పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్సులతో మొత్తంగా సర్వ వస్త్ర ప్రపంచంలా తీర్చిదిద్దామని చెప్పారు. తొలుత మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ప్రముఖులను డైరెక్టర్లు స్వాగతించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వార్డు కౌన్సిలర్ వాసర్ల లక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, వాణిజ్య పన్నుల శాఖ అధికారి ఇళ్ల భక్త వత్సలం తదితరులు పాల్గొన్నారు.

శ్రీపీఠంలో 70 కోట్లకు చేరుకున్న కుంకుమార్చనలు

యాగ వేదికను సందర్శించిన మంత్రి ధర్మాన, ఎంపీ గీత



శ్రీపీఠంలో భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న పరిపూర్ణానందస్వామి



శ్రీపీఠంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ వంగా గీత

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని శ్రీపీఠంలో మహాశక్తి యాగం వైభవంగా జరుగుతోంది. శతకోటి లలితా కుంకుమార్చనల్లో భాగంగా 70 కోట్లు పూర్తయ్యాయి. శనివారం 19వ రోజు అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చనలు చేశారు. పరిపూర్ణానందస్వామీజీ లలితా సహస్రనామాలను పఠిస్తూ ఈ పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశక్తి యాగం విజయవంతంగా జరుగుతుందని, మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారన్నారు. మరో 11 రోజుల్లో మహాశక్తి యాగం పూర్తవుతుందన్నారు. 13న పూర్ణాహుతితో యాగం ముగిస్తుందని, ఆ రోజు మహిళలు స్వయంగా తయారు చేసి తీసుకొచ్చిన బూరెలతో నైవేద్యం సమర్పిస్తామన్నారు. మహాశక్తి యాగం కుంకుమార్చనలను రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ వంగా గీత సందర్శించారు. ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామిని, లలితాంబవారిని వారు దర్శించుకున్నారు. పరిపూర్ణానందస్వామీజీతో కొద్దిసేపు మాట్లాడారు. యాగంలో భాగంగా ఉదయం శ్రీపెదంబదూరు పీఠాధిపతి సూరిబాబు సుందర చైతన్యానంద ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. సాయంత్రం కోటి దీపోత్సవ వేదికలో సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం దీపోత్సవం నిర్వహించారు. రాత్రి బగళాముఖి హోమం జరిగింది.

లోగుట్టు బయటపడింది

- పురుగు మందుల డబ్బాల్లో మద్యం
- అక్రమార్కుల కొత్త పంథా
- చివరికి పోలీసులకు చిక్కిన వైనం



మద్యం సీసాలు, నిందితులను చూపుతున్న పోలీసులు

నిడదవోలు/ పెరవలి: అక్రమార్కులు కొత్త పంథాలో తమ పనులను చక్కబెట్టేస్తున్నారు.. ఎవరికీ అనుమానం రాకుండా లోగుట్టుగా తమ పని కానిచ్చేస్తున్నారు. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. నిడదవోలు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం కథనం ప్రకారం.. రావులపాలేనికి చెందిన లంక దామోదర్, ముమ్మిడివరప్పాడుకు చెందిన ఉందుర్తి సూరిబాబులు కొంత కాలం కిందట రావులపాలెం మండలం రావులపాడులో ఒక షాపును అద్దెకు తీసుకున్నారు. వీరు యానాం వెళ్లి అక్కడ చీప్ లిక్కర్‌ను తక్కువ ధరకు కొని దాని పురుగు మందు డబ్బాల్లో నింపుకొని ఇక్కడకు తీసుకువచ్చి నిల్వచేసేవారు. తరువాత లిక్కర్ బాటిళ్లలో మద్యం నింపి అమాయకులకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

గుంటూరు నుంచి ఖాళీ 180 ఎంఎల్ క్వార్టర్ బాటిళ్లు, విజయవాడ నుంచి బాటిల్స్ మూతలను కొనుగోలు చేసేవారు. కంప్యూటర్‌పై లేబుల్స్ తయారు చేసి కలర్ ప్రింట్ తీసి వాటిని సీసాలకు అంటించి ఎవరికీ అనుమానం రాకుండా చూసేవారు. యానాం నుంచి తీసుకువచ్చిన చీప్ లిక్కర్‌ను ఆ బాటిళ్లలో నింపి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో రావులపాడు నుంచి 74 లిక్కర్ బాటిళ్లను మోటార్ సైకిల్‌పై తరలిస్తుండగా పెరవలి మండలం నల్లాకులవారిపాలెంలో జాతీయ రహదారిపై నిందితులు ఇద్దరినీ శుక్రవారం రాత్రి నిడదవోలు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తన సిబ్బందితో పట్టుకున్నారు. హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్.గంగన్నదొర, కె.శ్రీనివాస్, కానిస్టేబుళ్లు కె.లోకేశ్వరరావు, కె.సత్యనారాయణ ఎస్.దేవి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల విద్యాసంస్థల అధినేతకు పితృ వియోగం



నున్న చంద్రశేఖర్ రావు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలోని తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు తండ్రి నున్న చంద్రశేఖర్‌రావు (92) శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. చంద్రశేఖర్‌రావుకు ముగ్గురు కుమారులు నున్న తిరుమలరావు, కృష్ణ, సురేష్, కుమార్తె హేమంతపద్మావతి ఉన్నారు. ఆయన వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినా వారి పిల్లలను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారు. తన పెద్ద కుమారుడైన నున్న తిరుమలరావు తిరుమల విద్యా సంస్థలను స్థాపించి నేడు ఎంతోమందికి విద్యనందిస్తున్నారు. చంద్రశేఖర్‌రావు పార్థివదేహానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పలువురు ప్రముఖులు, తిరుమల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, గ్రామస్తులు నివాళులు అర్పించారు.

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
ఆదివారం ॥ 3-12-2023





పంట చేలో పాల కంకి పల్లకిలో పిల్ల ఎంకి నవ్వినంత అందంగా...

చీర గురించి ఎన్ని పాటలు రాసినా రాయాల్సినవి ఎన్నో మిగిలే ఉంటాయి. అందమైన చీరకట్టును చూస్తే పంటచేలో పాలకంకి, పల్లకిలో పిల్ల ఎంకీ నవ్వినంత అందంగా, అద్భుతంగా ఉంటుంది. డిజైనర్ నివేదిత సంజయ్ ప్రభు వినూత్నంగా డిజైన్ చేసిన చీరల ఛాయాచిత్రాలు నెటిజనులను ఆకట్టుకుంటున్నాయి. కేరళ కసువు శారీ (వైట్ కాటన్ శారీ విత్ గోల్డెన్ జరి బార్డర్) రకరకాల వేడుకలకు క్లాసిక్ ఫేవరేట్‌గా పేరు పొందింది. డిజైనర్ నివేదిత సంజయ్ ప్రభు ఈ చీరకు సంబంధించి పురాతన టెక్నిక్‌లను మాన్యువల్ స్క్రీన్ ప్రింటింగ్ ద్వారా తిరిగి తీసుకువచ్చింది. ప్రతి ప్రింట్ ఒక అందమైన కథ చెబుతుంది. అరటిఆకుల నుంచి ఇంగ్లీష్ రోజ్, చెంబూర్ ఫ్లవర్ వరకు ప్రకృతిలోని ఎన్నో అందాలు కసువు చీరెలో కనిపించి కనువిందు చేస్తాయి.

వైరల్

ఈ రైల్వే స్టేషన్ పేరు సచిన్!

స్టేడియంల సంగతి ఏమిటోగానీ రైల్వేస్టేషన్‌లకు క్రికెటర్‌ల పేర్లు ఊహించలేము. అయితే గుజరాత్‌లోని సూరత్ సమీపంలోని ఒక రైల్వేస్టేషన్ పేరు సచిన్. మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఈ రైల్వేస్టేషన్ ముందు దిగిన ఫోటో వైరల్‌గా మారింది.

‘ఈ రైల్వేస్టేషన్‌కు మన ఆల్‌టైమ్ గ్రేట్ క్రికెటర్‌లలో ఒకరైన నా ఫేవరెట్ క్రికెటర్, నా అభిమాన వ్యక్తి పేరు పెట్టారు. గత శతాబ్దానికి చెందిన పెద్దల ముందు చూపు అబ్బుర పరుస్తుంది’ అని ఇన్‌స్టాగ్రామ్‌లో రాశాడు సునీల్ గవాస్కర్.

ఇది చూసి ‘సచిన్‌లో సన్నీని చూడడం ఆనందంగా ఉంది’ అంటూ స్పందించాడు సచిన్ తెందూల్కర్.



నిజానికి ఈ రైల్వేస్టేషన్‌కి ‘సచిన్’ అనే పేరు సచిన్ తెందూల్కర్ తాత ముత్తాల కాలంలోనే ఉంది. సచిన్ తెందూల్కర్ పేరుకు, ఈ రైల్వేస్టేషన్ పేరుకు ఎలాంటి సంబంధం లేకపోయినా సరదా కోసం ‘పూర్వీకుల ముందుచూపు అబ్బురపరిచింది’ అని రాశాడు గవాస్కర్.



అలోకిక భట్టాచార్య, అమితాబ్

రైల్లో సీటు కింద... విమానంలో నెత్తి మీద

‘కౌన్ బనేగా కరోడ్‌పతి’ తాజా సీజన్‌లో కోల్‌కతాకు చెందిన ఒక గృహిణి తాను నవ్వడమే కాక అమితాబ్‌ను విపరీతంగా నవ్వించింది. కేబీసీ వల్ల మొదటిసారి విమానం ఎక్కిన ఆమె రైల్లోలాగా చీటికి మాటికి సీటు కింద చూసుకుంటూ లగేజీ ఉందా లేదాననే హైరానా విమానంలో లేకపోవడం తనకు నచ్చిందని చెప్పింది. ఇంకా సరదా కబుర్లు చెప్పి అమితాబ్‌ను నవ్వించిన అలోకిక భట్టాచార్య వైరల్ వీడియో గురించి....

సోనీ టీవీలో ప్రసారమవుతున్న ‘కౌన్ బనేగా కరోడ్‌పతి’ తాజా సిరీస్ తాజా ఎపిసోడ్‌లో కోల్‌కటాకు చెందిన అలోకిక భట్టాచార్య అనే గృహిణి అమితాబ్‌నే కాక ప్రేక్షకులను చాలా నవ్వించింది. ఆమె క్లిప్పింగ్‌ను అమితాబ్‌తో పాటు ఇతరులు ‘ఎక్స్’లో షేర్ చేయడంతో నెటిజన్లు ముచ్చటపడుతున్నారు. గత 17 ఏళ్లుగా ప్రయత్నిస్తే ఇప్పటికి కేబీసీలో పాల్గొనే అవకాశం దొరికిన అలోకిక ‘జై కేబీసీ’ నినాదంతో హాట్‌సీట్‌లో కూచుంది. ‘మీ ప్రయాణం ఎలా సాగింది?’ అని అమితాబ్ అడిగితే ‘కేబీసీ పుణ్యమా అని మొదటిసారి విమానం ఎక్కాను. మాలాంటి వాళ్లం రైలెక్కి ప్రతి పది నిమిషాలకూ ఒకసారి సీటు కింద లగేజ్ ఉందా లేదా చూసుకుంటాం. అర్ధరాత్రి మెలకువ వచ్చినా మొదట సీటు కిందే చూస్తాం. విమానంలో ఆ బాధ లేదు. లగేజ్ నెత్తి మీద పెట్టారు. పోతుందనే భయం వేయలేదు’ అనేసరికి అమితాబ్ చాలా నవ్వాడు. ‘కేబీసీ వాళ్లు ఎలాంటి ప్రశ్నలు వెతికి ఇస్తున్నారంటే నేనసలు ఏమైనా చదువుకున్నానా అని సందేహం వస్తోంది’ అని నవ్వించిందామె. ‘నువ్విలా నువ్వుతుంటే మీ అత్తగారు ఏమీ అనదా?’ అంటే ‘అంటుంది. కాని నేను నా జీవితంలో జరిగిన మంచి విషయాలు గుర్తు తెచ్చుకుని ఎప్పుడూ నవ్వుతుంటాను. అదే నా ఆరోగ్య రహస్యం. మూడు పూటలా అన్నం, పప్పు, చేపలు తింటూ కూడా సన్నగా ఎలా ఉన్నానో చూడండి. ఫ్రీగా. కొంతమంది ఇలా ఉండటానికి డబ్బు కట్టి జిమ్ చేస్తుంటారు’ అని నవ్వించిందామె. అలోకిక ఈ ఆటలో పన్నెండున్నర లక్షలు గెలిచి ఆట నుంచి విరమించుకుంది. ఆ మొత్తం ఆమెకు చాలా ముఖ్యమైనదే. కాని అమితాబ్‌తో నవ్వులు చిందించడం అంతకంటే ముఖ్యంగా ఆమె భావించింది.

లవ్ యూ బామ్మా



85 సంవత్సరాల వయసులో కంటెంట్ క్రియేటర్‌గా మారింది విజయ నిశ్చల్. ఫ్రెంచ్ ఫ్రై, సమోస, గులాబ్ జామూన్, పొటాటో బాల్స్...ఒక్కటా రెండా ఎన్నెన్నో పసందైన వంటలను ఎలా చేయాలో తన చానల్ ద్వారా నేర్పుతుంది నిశ్చల్. వంటలు చేస్తూ ఆ వంటకు తగినట్లుగా హుషారుగా పాటలు పాడుతుంటుంది. ఈ బామ్మ చానల్‌కు 8.41 లక్షల ఫాలోవర్‌లు ఉన్నారు. తాజాగా నిశ్చల్ బామ్మ చేసిన ‘ఎగ్‌లెస్ కేక్’ వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియో 1.1 మిలియన్‌ల వ్యూస్ దక్కించుకుంది.

‘ఎగ్‌లెస్ కోసం ఎన్నో చోట్ల ప్రయత్నించాను. మీ వీడియో చూసిన తరువాత నేను స్వయంగా చేశాను. ఇదంతా మీ చలవే. లవ్ యూ బామ్మా’

‘వంటల్లో ఓనమాలు కూడా తెలియని నేను మీ వల్ల ఇప్పుడు ఎన్నో వంటలు చేయగలుగుతున్నాను. నా టాలెంట్‌ను చూసి ఫ్రెండ్స్ ప్రశంసిస్తున్నారు’... ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనబడుతున్నాయి.

శశిథరూర్‌లాగా ఇంగ్లీష్ గిట్ల మాట్లాడాలే...

కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అరుదైన, పలకడానికి కష్టంగా ఉన్న ఇంగ్లీష్ పదాలు వాడుతుంటాడు అనేది తెలిసిన విషయమే. అతడి ఖరీదైన ఇంగ్లీష్‌కు చాలామంది అభిమానులు ఉన్నారు. తాజాగా ఆస్ట్రేలియాకు చెందిన జే అనే టీచర్ ‘శశి థరూర్స్ ఇంగ్లీష్ యాక్సెంట్ ఈజ్ బ్యూటీఫుల్’ అనడమే కాదు అతడిలా చక్కని ఇంగ్లీష్ మాట్లాడాలంటే అంటూ కొన్ని టిప్స్ చెప్పాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో జే పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. శశి థరూర్ ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్న వీడియోలను ప్లే చేస్తూ....

‘చూడండి ఈ పదాన్ని ఎలా పలికాడో. ఆ పదాన్ని ఎలా స్ట్రెస్ చేశాడో’ అంటూ చెబుతూ పోతాడు జే.



రైలే కళ్యాణ వేదిక!

కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదు...అంటారు. కళ్యాణ ఘడియ ముంచుకొచ్చింది...అనుకున్నారేమో ఒక ప్రేమ జంట బెంగాల్–జార్ఖండ్ మూవింగ్ ట్రైన్‌లోనే దండలు మార్చుకున్నారు. ఆ తరువాత వరుడు వధువు మెడలో తాళి కట్టాడు. వధువు భావోద్వేగానికి గురై ఏడ్చింది. ఈ ‘రైలు పెళ్లి’ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. బోగీలో ఉన్న ప్రయాణికులు ఈ పెళ్లి తంతు చూసి మొదట



షాక్ తిన్నా ఆ తరువాత మాత్రం ఆశీర్వదించారు.

‘మల్టీ పర్పస్ ఇండియన్ రైల్వేస్’

‘విమానంలో జరిగే పెళ్లి కంటే ఇది నయం. తక్కువ ఖర్చు కదా’... ఇలాంటి కామెంట్స్ నెటిజనుల నుంచి వచ్చాయి. ఇక మరో పెళ్లి విషయానికి వస్తే... ఢిల్లీకి చెందిన 27 సంవత్సరాల అవినాష్ కుమార్ డెంగ్యూ బారిన పడ్డాడు. బెడ్ మీద నుంచి లేవలేని పరిస్థితి. ఈలోపు పెళ్లిరోజు రానే వచ్చింది. దీంతో హాస్పిటల్‌లోనే వధువు మెడలో తాళి కట్టించి పెళ్లి చేశారు.

హెల్త్

కాపాడే కన్నీరు పొడిబారితే..!

కన్ను ఎప్పుడూ తడిగా ఉంటుంది. ఏదైనా కాస్త తగలగానే కళ్లల్లోంచి నీళ్లు కారిపోతుంటాయి. కన్ను పొడిబారితే ప్రమాదమని ప్రకృతి ఈ కన్నీళ్లను ఏర్పాటు చేసింది. నిత్యం ఏసీ గదుల్లో ఉండటం, కంప్యూటర్‌దో, ల్యాప్‌టాప్‌లదో, ఆఖరికి మొబైల్ స్క్రీన్‌నో ఎప్పుడూ చూస్తూ ఉండటంతో పాటు... కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు, జబ్బులు ఉన్నప్పుడు కూడా కన్నుపొడిబారుతుంది. ఇలా పొడిబారడం వల్ల కంటి ఇన్ఫెక్షన్లు వచ్చేందుకూ, ఒక్కోసారి చూపు కోల్పోయేందుకూ అవకాశముంది. కన్ను పొడిబారే సమస్యను వైద్య పరిభాషలో ‘కెరటో కంజంక్టివైటిస్ సిక్కా’(డ్రై ఐ) అని చెబుతారు. ఈ కండిషన్ అవగాహన పెంచుకుని, కంటిని ఎలా కాపాడుకోవాలో తెలుసుకోవడానికి ఉపయోగపడేదే ఈ కథనం.



కంటిని తడిగా ఉంచడానికి లాక్రిమల్ గ్లాండ్స్ అనే ప్రధాన కన్నీటి గ్రంథితో పాటు మ్యూసిన్ గ్లాండ్స్, మెబిమియన్ గ్లాండ్స్ అనే మరో రెండు రకాల గ్రంథులూ తోడ్పడతాయి. ఇందులో లాక్రిమల్ గ్లాండ్స్ నీటి మోతాదులెక్కువగా ఉండే కన్నీటినీ, మ్యూసిన్ గ్లాండ్స్ కాస్త జిగురుగా ఉండే పదార్థాన్నీ, ఇక మెబొమియాన్ గ్లాండ్స్ అనేవి కాస్త నూనెలా ఉండే పదార్థాన్ని (ల్యూబ్రికెంట్‌గా ఉపయోగపడేందుకు) స్రవిస్తాయి. ఈ మూడూ కలిసి పూర్తి కన్నీటి స్రావాలకు కారణమవుతాయి.

గ్రంథుల పనితీరు మారుతుండే లోపాలు...

ఈ మూడు గ్రంథుల పనితీరుల్లో, దేనిలో లోపం వచ్చినా... కన్నీటి నాణ్యత దెబ్బతింటుంది. ఏయే గ్రంథుల్లో లోపాలుంటాయో, దాన్ని బట్టి కన్నుపొడిబారడమనే ప్రక్రియలోనూ తేడాలొస్తాయి.

ఉదాహరణకు...

- లాక్రిమల్ గ్లాండ్ కన్నీటిలోని నీళ్లను స్రవిస్తుంది. కాబట్టి దీనిలో లోపంతో కన్నీటిలోని నీరు మోతాదులు తగ్గుతాయి.
- మ్యూసిన్ తగ్గితే ‘టియర్ బ్రేకింగ్ టైమ్’ తగ్గుతుంది. అంటే కన్నీరు స్రవించాక అది ఓ పొర (ఫిల్మ్)లా ఏర్పడి... కొంతసేపు కన్ను ఉపరితలం మీద ఉంటుంది. ఏర్పడ్డ తర్వాత ఆ ఫిల్మ్ ఎంతసేపు ఉంటే... కంటికి అంత రక్షణ.
- ఇక కన్ను త్వరగా పొడిబారుతుందంటే... (అంటే నీరు త్వరత్వరగా ఆవిరై పోతుందంటే) మెబోమియన్ గ్లాండ్స్ పనితీరు తగ్గిందని అర్థం. బయట గాలివేగం ఎక్కువగా ఉన్నప్పుడు (విసురుగా గాలి వీస్తున్నప్పుడు), టూవీలర్ డ్రైవింగ్‌లో కన్నీరు ఎక్కువగా ఆవిరవుతుంది.

లక్షణాలు

కళ్లలో మంట : కళ్లలో తగినంతగా నీరు స్రవించనప్పుడు కళ్లు మంటలు వస్తాయి. కానీ కళ్లు ఎర్రబారవు. **మసక బారడం :** కొందరిలో చూపు కాస్తంత మసకబారవచ్చు. **వెలుగును చూడలేకపోవడం :** ఎక్కువ వెలుగును చూడలేకపోవడం, ప్రకాశవంతమైన కాంతిని భరించలేకపోవడం. **కాంటాక్ట్ లెన్స్‌లు పెట్టుకునేవారిలో:** కాంటాక్ట్‌లెన్స్‌లు వాడటంలో ఇబ్బందిగా ఉండటం.

కానీ జీవనశైలి మార్పులతో అంటే ఏసీలు, స్క్రీన్‌ను చాలాసేపు చూడటం, పొగతాగడం వంటి అలవాట్లతో ఆవిరి కావడం పెరుగుతుంది. దీన్నే ‘ఎవాపరేటివ్ డ్రై ఐ’ అంటారు.

కన్ను పొడిబారడానికి మరికొన్ని కారణాలు...

కన్ను పొడిబారడానికి అనేక కారణాలు ఉంటాయి. అవి...

- **వయసు పైబడటం:** వయసు పెరుగుతున్న కొద్దీ కన్ను పొడిబారడమూ పెరుగుతుంటుంది. మహిళల్లో మెనోపాజ్ తర్వాత ఇది ఎక్కువ.
- **కొన్ని వైద్య సమస్యలు:** థైరాయిడ్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, సాధారణ ఆటోఇమ్యూన్ సమస్యలు, కొలాజన్ వాస్క్యులార్ డిసీజ్, దీర్ఘకాలిక డయాబెటిస్, సిస్టమిక్ లూపస్ అరిథమటోసిస్ వంటి రుగ్మతలు ఉన్నవారిలో, కీళ్ల నొప్పులతో బాధపడేవారిలో ఈ సమస్య ఎక్కువ.
- **కొన్ని రకాల మందులు :** యాంటీ డిప్రెసెంట్స్, యాంగ్జైటీని తగ్గించే మందులు, శరీరంలో నీటిని బయటకు పంపించే డైయూరెటిక్స్, మహిళల్లో గర్భనిరోధక మందులు, స్టెరాయిడ్స్, దీర్ఘకాలం పాటు గ్లకోమాకు మందులు వాడేవారిలో... ఇలా అనేక మందులతో ఈ సమస్య పెరుగుతుంది.
- **జీవనశైలి మార్పులతో :** ● ఏసీ గదుల్లో ఎక్కువసేపు ఉండటం ● కనురెప్పలను తక్కువగా కదిలించడం... కంప్యూటర్ పైనా లేదా ల్యాప్‌టాప్, టీవీ, మొబైల్ వరకూ ఏదైనా స్క్రీన్‌ను ఎక్కువగా సేపు చూస్తుండటం, మైక్రోస్కోప్ వంటి ఉపకరణాలపై ఎక్కువగా పనిచేయడం. ● కనురెప్పలను పూర్తిగా మూయలేకపోవడం. ● కంటికి గాయం కావడం వల్ల కనురెప్పలను తగినంత కదిలించలేనప్పుడు. ● కనురెప్ప అంచుల్లో ఇన్ఫెక్షన్ (బ్లెఫరైటిస్) ఉన్నవారిలో కన్ను పొడిబారడం ఎక్కువ. ● కంటికి లేజర్ చికిత్స చేయించుకున్నవారిలో మొదటి మూడునెలల్లో మాత్రం కన్నుపొడిబారే సమస్య వచ్చేందుకు అవకాశం ఉంది.

ఇక కొందరిలో కారణాలేవీ కనిపించకుండానే ఈ సమస్య రావచ్చు.



డా॥ రవికుమార్ రెడ్డి, సీనియర్ కంటి వైద్య నిపుణులు

నిర్ధారణ ఇలా...

- లక్షణాలను బట్టి కంటి డాక్టర్‌లు సమస్యను నిర్ధారణ చేస్తారు. అయితే కొందరిలో కొన్ని రకాల ఇతర వ్యాధుల వల్ల (జోగ్రెన్స్ సింగ్రోమ్ వంటి వాటి కారణంగా) ఇలా జరుగుతుందేమో అని చూస్తారు. అందుకే కన్ను పొడిబారిన లక్షణాలు ఉండేవారికి వ్యాధి నిర్ధారణ చేసే సమయంలో అనేక ఇతర లక్షణాలను కూడా డాక్టర్లు అడిగి తెలుసుకుంటూ ఉంటారు.



- **షిర్మర్ టియర్ టెస్ట్:** కొన్ని సందర్భాల్లో షిర్మర్ పరీక్షతో దీన్ని నిర్ధారణ చేస్తారు. ఈ పరీక్షలో ఒక రకం ఫిల్టర్ పేపర్‌ను కంటి కిందివైపు రెప్ప కింద ఐదు నిమిషాల పాటు ఉంచుతారు. ఆ వ్యవధిలో ఆ పేపర్ ఎంత తడి అవుతుందో పరిశీలించడం ద్వారా లాక్రిమల్ గ్లాండ్ లోపాల్ని పరీక్షిస్తారు.
- **టియర్ బ్రేకప్ టైమింగ్ :** కంటి ఉపరితలంపై ఏర్పడే టియర్ ఫిల్మ్ ఎంతసేపటికి బ్రేక్ అవుతుందో తెలుసుకునే ఈ పరీక్షతో మ్యూసిన్ గ్రంథి లోపాలను తెలుసుకుంటారు.
- **మెబోమియోగ్రఫీ :** ఈ టెస్ట్‌తో మెబోమియన్ గ్రంథి లోపం తెలుస్తుంది.
- **ఓసీటీ :** ఆప్టికల్ కొహరెన్స్ టోమోగ్రఫీ (ఓసీటీ) అనే పరీక్ష ద్వారా టియర్ ఫిల్మ్ మందం ఎంత ఉందో తెలుసుకుంటారు.

ఇబ్బందులివీ...

కన్ను పొడిబారడం వల్ల వచ్చే సమస్యలు అందరిలో ఒకేలా ఉండవు. ఈ కింద పేర్కొన్న వాటిలో కొన్ని కనిపించవచ్చు. ● కొందరిలో కంటిపైన ఉండే కంజెక్టివా పొరలో ఇన్ఫెక్షన్ రావచ్చు. (కంజంక్టివైటిస్). ● కొందరిలో కార్నియల్ ఇన్ఫెక్షన్ రావచ్చు. ● సమస్య తీవ్రతను బట్టి కొందరి కళ్లలో చిన్న చిన్న పుండ్లు రావచ్చు. ● చాలా అరుదుగా కొందరిలో కార్నియా దెబ్బతినే ప్రమాదంకూడా ఉండవచ్చు.

చికిత్స... గతంలో కన్నీటిని స్రవించే చుక్కల మందులు, జెల్స్‌తో చేసే చికిత్స స్థానంలో ఇప్పుడు ఏయే గ్రంథి లోపాలు ఏమిటో తెలుసుకుని, వాటికి అనుగుణంగా చేసే చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు...

కృత్రిమ కన్నీటి మందులు: కృత్రిమంగా కన్నీళ్లను పెంచే చుక్కల మందులు, జెల్ రూపంలో లభ్యమయ్యే మందుల్ని వాడటం ద్వారా డాక్టర్లు లాక్రిమల్ గ్లాండ్ పనితీరును చక్కదిద్దుతారు. ‘సైక్లో ఇమ్యూన్ ఐ డ్రాప్స్’ కూడా డ్రై ఐ చికిత్సకు ఉపయోగపడతాయి. అలాగే లాక్రిమల్ ప్లగ్స్‌ను వాడతారు. వీటివల్ల కన్నీళ్లు ముక్కులోకి జారిపోవు. దాంతో అవి కళ్లలోనే ఎక్కువసేపు ఉండి కళ్లను తడిగా ఉంచుతాయి. ● ఇక మ్యూసిన్ గ్రంథి పనితీరు మెరుగుపరచడానికి ‘సెక్రిటోగ్యాగ్స్’ అనే ఉపకరణాలు ఉపయోగిస్తారు.

● మెబోమియన్ గ్లాండ్స్ పనితీరును మెరుగుపరచడానికి కొన్ని రకాల మసాజ్‌లు, థెర్మో థెరపీలతో పాటు కొన్ని రకాల యాంటీబయాటిక్స్ వాడతారు. ● డ్రై ఐ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నవారిలో సంప్రదాయ చికిత్సలతో తగ్గనప్పుడు బాధితుని నుంచి సీరమ్ (ఆటోలాగస్ సీరమ్) సేకరించి, చుక్కల రూపంలో వాడతారు. ● **శస్త్ర చికిత్స :** ఈ చికిత్సలో భాగంగా నోటిలోని అతి మృదువైన పొరలను తీసి, కంటిలో అమర్చి... పరిస్థితిని చక్కబరుస్తారు.

ఇవేకాకుండా... పని ప్రదేశాల్లో ఏ జాగ్రత్తలు తీసుకోవాలో, కంప్యూటర్ ముందు కంటిని హాని తక్కువగా ఉండేలా ఎలా కూర్చోవాలో, తగిన వ్యాయామాలేమిటో, బరువు తగ్గించుకోవడం, అవసరాన్ని బట్టి పనిచేసే గదిలో తేమ (హ్యుమిడిటీ) పెంచుకోవడం... ఇవన్నీ బాధితులకు కౌన్సెలింగ్‌లో డాక్టర్లు చెబుతారు.

కన్నుపొడిబారిపోవడం వల్ల ఒక్కోసారి చూపుకోల్పోవడం లాంటి పెను ముప్పు ఉండే అవకాశాలు ఎక్కువ. అందుకే కన్నుపొడిబారుతుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగిన మందులు వాడాలి.

ప్యాచుల లాంటి ఖాళీలతో కనిపించే పేనుకొరుకుడు!

కొందరిలో ఒత్తైన తలకట్టు కనిపిస్తూనే... మధ్య మధ్యలో నున్నటి ఖాళీలు (గ్యాప్‌లు) కనిపిస్తూ ఉంటాయి. ఆ ప్యాచ్‌లు న్యూనతకు గురిచేస్తాయి. ఈ సమస్యను ‘పేనుకొరుకుడు’ అనీ, వైద్య పరిభాషలో ‘అలోపేషియా ఏరేటా’ అని అంటారు. ‘అలోపేషియా ఏరేటా’ సమస్య ఉన్నప్పుడు అది తలకే పరిమితం కాకుండా... ఒక్కోసారి శరీరంలోని ఇతర భాగాల్లోనూ జుట్టు రాలేలా చేయవచ్చు. ఇక పురుషుల్లో గడ్డంలోనూ కనిపిస్తూ, కాస్మటిక్ పరంగా చూసినప్పుడు ఇబ్బందిగా పరిణమిస్తుంది.



కారణాలు...

ఈ సమస్యకు నిర్దిష్టమైన కారణం చెప్పడం కష్టం. ఒకరకంగా చెప్పాలంటే ఇది ఆటో ఇమ్యూన్ సమస్య. అంటే మన వ్యాధి నిరోధక శక్తి, మన దేహం పట్ల వ్యతిరేకంగా పనిచేయడం వల్ల ఉత్పన్నమయ్యే సమస్య. ఈ సమస్య కనిపించిన వారిలో అలర్జీ తాలూకు లక్షణాలూ కనిపించే అవకాశాలు ఎక్కువ. ఇక పిల్లల్లో ఈ సమస్య వస్తే... వారిలో థైరాయిడ్ సమస్యలూ (ప్రధానంగా హైపోథైరాయిడిజమ్), కళ్ల సమస్యలూ, కడుపులో ఇబ్బందులు... ఆటో ఇమ్యూనిటీ వల్ల కలిగే ఇతర సమస్యలూ కనిపించవచ్చు. ఇక కుటుంబ చరిత్రలో ఈ సమస్య ఉన్నప్పుడు అనువంశికంగా కూడా ఈ సమస్య రావచ్చు.

లక్షణాలు...

తలకట్టులో లేదా గడ్డంలో లేదా శరీరంలోని ఇతర భాగాల్లో ఉన్న జుట్టులో ప్యాచ్‌లు ప్యాచ్‌లుగా ఖాళీలు (గ్యాప్‌లు) కనిపిస్తుండటం. వాటితో పాటు బాధితుల్లో (ప్రధానంగా పిల్లల్లో) అలర్జీకి సంబంధించిన లక్షణాలు కనిపిస్తూ, జుట్టు కూడా వేగంగా రాలిపోతూ ఉండవచ్చు.

చికిత్స ఇలా..

వెంట్రుకలు రాలిపోయిన ప్రాంతాల్లో పైపూతగా రాసే స్టెరాయిడ్ క్రీమ్స్ (టాపికల్ స్టెరాయిడ్స్)ను డాక్టర్లు సూచిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో జుట్టు రాలిన చోట చర్మానికి ఇంజెక్షన్లు ఇస్తారు. దీంతో పాటు కొందరిలో అల్ట్రా వయొలెట్ థెరపీ వంటి వాటితో కొంత వరకు ప్రయోజనం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో హెయిర్ గ్రోత్ ప్రమోటింగ్ ఏజెంట్స్ మందుల్ని వాడాల్సి ఉంటుంది. ఇక టాపికల్ స్టెరాయిడ్స్‌తో పాటు స్టెరాయిడ్ మోతాదులు ఉండే మందులన్నీ బాధితులను చాలా అంశాలలో పరీక్షించి, పరిశీలించి, నిర్దిష్టమైన మోతాదుల్లో మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది. కాబట్టి వాటిని తప్పనిసరిగా డర్మటాలజిస్ట్‌ల పర్యవేక్షణలో మాత్రమే వాడాల్సి ఉంటుంది.

కొన్ని సందర్భాల్లో ఈ సమస్య మానసికంగా న్యూనతను పెంచే అవకాశం ఉన్నందున కొంత మందిలో ఇది కుంగుబాటు వంటి మానసిక సమస్యలకూ దారి తీయవచ్చు. ముఖ్యంగా పిల్లలు, టీనేజ్ యువతుల్లో ఈ సమస్య ఎక్కువ. బాధితులతో కౌన్సెలింగ్‌తో డాక్టర్లు ఏ కారణంగా ఈ మానసిక సమస్యలు వస్తున్నాయో తెలుసుకుని, ప్రధాన సమస్యకు చికిత్స అందిస్తే... మానసిక సమస్యలనూ తగ్గించడం సాధ్యమవుతుంది.



డా॥ స్వప్నప్రియ, సీనియర్ డర్మటాలజిస్ట్.



మెడి టిప్: నిమోనియా నివారణకు...

నిమోనియా ఊపిరితిత్తులను ప్రభావితం చేసే శ్వాససమస్య. అనేక రకాల ఇన్ఫెక్షన్లు నిమోనియాకు దారితీస్తాయి. ఇలా సెకండరీ ఇన్ఫెక్షన్స్‌తో వచ్చే నిమోనియా ఒక్కోసారి ప్రాణాంతకం కూడా కావచ్చు. దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...

నివారణ ఇలా... ● కొద్ది ప్రదేశంలోనే ఎక్కువమంది ఉండటం అనే ఓవర్ క్రౌడింగ్ పరిస్థితికి దూరంగా ఉండాలి. గుంపుల్లోకి వెళ్లకూడదు. ● ఆస్తమా, బ్రాంకైటిస్ బాధితులు వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి. ● పొగ వాతావరణానికి ఎక్స్‌పోజ్ కాకుండా చూసుకోవాలి. అలాగే పొగతాగే అలవాటును తక్షణం మానేయాలి.
● ఆల్కహాల్ అలవాటుకూ దూరంగా ఉండాలి. మద్యం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అంతేకాదు... మత్తులో దగ్గడం కూడా తక్కువే. దాంతో ఊపిరితిత్తుల్లో ఉన్న మనకు సరిపడని పదార్థాలు అక్కడే ఉండిపోవడం వల్ల కూడా నిమోనియా తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ● అన్ని పోషకాలు ఉండే సమతులాహారం తీసుకోవాలి. ● క్రమం తప్పకుండా తేలికపాటి వ్యాయామం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. ఫలితంగా నిమోనియా మాత్రమే కాకుండా ఇతర ఇన్ఫెక్షన్లూ నివారితమవుతాయి.
● చిన్నపిల్లలకు, పెద్దవయసు వారికి నిమోనియాను నివారించే వ్యాక్సిన్ ఇవ్వడం మంచిది.